క్లుప్తంగా

ద్విచక్రవాహనం దగ్ధం



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు, ధర్మవరం గ్రామాల మధ్యన టీవీఎస్ ఎక్సల్ ద్విచక్రవాహనం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మండల పరిధిలోని సుందరయ్య కాలనీకి చెందిన పద్దం చంద్రయ్యకు చెందిన మోటార్ సైకిల్‌ను బంధువులకు చెందిన యువకుడు ధర్మవరం గ్రామానికి పని పై తీసుకెళ్లాడు. చెరుకూరు, ధర్మవరం గ్రామాల మధ్యకు వెళ్ల గానే మోటార్ సైకిల్ లోపలి నుంచి మంటలు చెలరేగాయి. మోటార్ సైకిల్ పూర్తిగా కాలి దగ్ధమైంది. మోటార్ సైకిల్ కాల డానికి షార్ట్ సర్క్యూట్ అయి ఉంటుందని బావిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని పాల్‌సాబ్‌పల్లి గ్రామానికి చెందిన పోలు లక్ష్మి మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన జంగా సుగుణ ఇటీవల మరణించగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, నల్లెల భరత్ కుమార్, రేవంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కమిటీ ఎన్నిక



అప్సర్ పాషా

కన్నాయిగూడెం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎండీ.అప్సర్ పాషాను ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జ్ గుడ్ల దేవేందర్, ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఆదేశాలతో ఒక ప్రకటనలో విడుదల చేశారు.

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: రేగొండ మండలంలోని మడ్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను మానసికంగా వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో ఉపాధ్యాయులు తమను మానసికంగా, శారీరకంగా, లైంగికంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని నెల రోజుల క్రితం పాఠశాల ఎదుట ధర్నా చేసినట్లు తెలిపారు. దీంతో విచారణ చేసిన అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, క్రాంతికుమార్, శ్రీనివాస్, సందీప్, రమేష్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ సీట్ల సంఖ్య పెంచాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించే బెస్ట్ అవైలబుల్ సీట్ల సంఖ్యను పెంచాలని ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు మడికొండ రఘుపతి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డిని కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంతో పాటు సమీప మండలాల్లో అనేక మంది ఎస్సీ నిరుపేద విద్యార్థులు ఉన్నారని ఉచితంగా విద్యనభ్యసించే అవకాశం కల్పించాలని కోరారు.

ఒకరి మృతి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి–చెల్పూర్ మధ్య జాతీయ రహదారిపై మంజూర్‌నగర్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానిక ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దపూర్ గ్రామానికి చెందిన గట్టు రఘు(30) తన మోటార్ సైకిల్‌పై భూపాలపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. కేటీకే–8వ గని మూలమలువు వద్ద వెనుకవైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో రఘు తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రఘు భార్య స్నేహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితుడి అరెస్టు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని మడ్తపల్లికి చెందిన సూర సుధాకర్ కొయ్యడ రఘుపై దాడి చేసి, కులం పేరుతో దూషించగా మంగళవారం అతనిపై కేసు నమోదు చేశారు. కాగా బుధవారం అతన్ని అరెస్టు చేసి జిల్లా కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.


అడుగంటుతున్న గోదావరి జలాలు

- సమ్మక్క సాగర్ వద్ద తేలిన ఇసుక మేటలు
- తగ్గుతున్న నీటిమట్టం
- ప్రస్తుతం 74.15 మీటర్లు



సమ్మక్క సాగర్ వద్ద గోదావరి నీటి మట్టం

కన్నాయిగూడెం: గోదావరిలో నీరు రోజు రోజుకూ తగ్గుతూ గోదావరి బీటలు బారుతోంది. వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎగువ నుంచి రావాల్సిన నీరు రావడంలేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సరస్వతీ, లక్ష్మీ బ్యారేజీల నుంచి నీరు రాక తుపాకులగూడెం వద్ద గోదావరికి నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమేపి తగ్గుతూ వస్తుంది. బ్యారేజీ సామర్థ్యం 6.94టీఎంసీ,(83మీటర్లు) కాగా ప్రస్తుతం బ్యారేజీ వద్ద 74.15 మీటర్ల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో బ్యారేజీ వద్ద పవర్ ప్లాంట్ కోసం నిర్మించిన ప్రాంతంలో ఇసుకమేటలు దర్శనమిస్తున్నాయి. దేవాదులకు జీవనాధారంగా పిలువబడే సమ్మక్క సాగర్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. దేవాదుల వద్ద మూడు ఫేజ్‌లలో 10 మోటార్లు ఉన్నాయి. అందులో 5 మోటార్ల ద్వారా మాత్రమే పంపింగ్ కొనసాగిస్తున్నారు. మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువ ఉంటుంది. దానితో పాటు నీటివినియోగం కూడా పెరుగుతుంది. దీనితో ఉన్నమోటార్లు ఆన్ చేస్తే నీటి కొరత ఏర్పడినట్లే అని అనుకుంటున్నారు. దీనిని పూడ్చాలంటే ఎగువ ప్రాతంలోని సరస్వతీ, లక్ష్మీ బ్యారేజీల నుంచి కొన్ని గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలవలసి ఉంటుంది.



పవర్ ప్లాంట్ ప్రాంతంలో ఇసుకమేటలు

సాయం చేయడం అలవర్చుకోవాలి



నరేష్, సురేష్‌లను సన్మానిస్తున్న సర్పంచ్

ఏటూరునాగారం: తోటివారు ఆపదలో ఉన్నప్పుడు సాయం చేయాలని ఆలోచన రావాలని, సాయం చేసి అండగా నిలబడాలని సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. బుధవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తన స్నేహితుడు బొగ్గుల రామకృష్ణ ఆపదలో ఉండగా ఆదుకున్న వద్ది నరేష్, శ్రీరామ్ సురేష్‌లను సర్పంచ్ రామ్మూర్తి, బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు వహిద్‌లు సన్మానించారు. ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన బొగ్గుల రామకృష్ణ ఇటీవల చెట్టుపై నుంచి పడి ఆస్పత్రిలో చేరగా ఆర్థిక సాయం కోసం తన స్నేహితులు వద్ది నరేష్, శ్రీరామ్ సురేష్‌లు నగదును సేకరించి బాధిత కుటుంబానికి అప్పగించారు. ఈ మేరకు నరేష్, సురేష్‌లను సన్మానించారు. ఆపదలో ఉన్న వారికి తనకు తోచిన సాయం చేయడంతోపాటు ఇతరల నుంచి సాయాన్ని కల్పించడం మానవత్వం అవుతుందన్నారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, బ్లడ్ డోనర్స్ యూనియన్ ఖాజాపాషా, ఎర్రమనేని సతీష్, గండెపల్లి సుకేష్, బండపల్లి సంతోష్, పెయ్యల రాకేష్, విజయ్ భాస్కర్, రామకృష్ణ, కాళ్ల రామకృష్ణ, సంఘం గోపి పాల్గొన్నారు.

గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న నిఖిల్‌కుమార్

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో తోగ్గుడెం అనే గొత్తికోయగూడెంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంలో గర్భిణులు, బాలింతలు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు, బీపీ, షుగర్ బాధితులతో పాటు జ్వరం, జలుబు, దగ్గు టీబీ(క్షయ), లెప్రసీ, వైద్య పరీక్షలు నిర్వహించారు. గూడెంలోని 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, హెల్త్‌అసిస్టెంట్ పొదెం రవికుమార్, ఏఎన్ఎం సీతారావమ్మ, ఆశా కార్యకర్తలు రాణి, సులోచన, లక్ష్మీబాయి, నాగమణి, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన మల్యాల శకుంతల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందగా రూ.12వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. ఆయన వెంట నర్సింహరావు, ఎల్లయ్య, లాల్‌మహ్మద్, వినయ్, రవి, మహేష్ ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న నాయకులు

చిరు వ్యాపారులకు శాశ్వత షెడ్లు నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ములుగు రూరల్: మల్లంపల్లిలో రోడ్డుకు ఇరువైపుల చిరువ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి శాశ్వత షెడ్ నిర్మాణాలు చేపట్టాలని ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్ కోరారు. ఈ మేరకు బుధవారం జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల పక్కన వ్యాపారాలు కొనసాగించడంతో రవాణాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. ఈ విషయంపై స్పందించిన జెడ్పీ చైర్మన్ స్థల పరిశీలన చేసి చిరు వ్యాపారులకు షెడ్ నిర్మాణాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నరహరి, శ్రీకాంత్, సంతోష్, అనిల్, శ్రీను, రాజు , అయిలయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి




సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

టేకుమట్ల: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై చల్ల రాజు కోరారు. బుధవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో సర్పంచ్ నల్లబెల్లి రమ ఆధ్వర్యంలో మేము సైతంలో భాగంగా సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లోని కూడళ్లలో, రద్దీ ప్రాంతాల్లో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోకి వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడితే సులభంగా గుర్తించవచ్చని అన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి దొంగతనాలకు తావులేకుండా ఉండవచ్చని తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీల్లో త్వరలోనే అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏనుగు తిరుమల, నాయకులు రవీందర్, లచ్చిరెడ్డి, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

అన్నిమతాల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: సర్వమతాల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం భూపాలపల్లి పట్టణకేంద్రంలోని జామ మసీద్‌లో రంజాన్ పండుగ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ఇస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమానికి కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా మత పెద్దలకు స్వీట్లు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ముస్లింలకు షాదీఖాన నిర్మాణానికి ఇప్పటికే రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అందుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించి కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మంజూర్ నగర్ రామప్ప కాలనీ దగ్గరలో ఖబ్రస్తాన్ నిర్మాణానికి 3 గుంటల స్థలం కేటాయించాలని సింగరేణి ఏరియా జీఎంను కోరారు. ముస్లింలకు ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కానుకలను అందజేశారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత తాడ్వాయి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈటోర్నమెంట్‌లో తాడ్వాయి ట్రెండ్ యూత్ జట్టు విజయం సాధించగా, ఇందిరానగర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. తాడ్వాయి ప్రథమ విజేత జట్టుకు రూ.10వేలు. ఇందిరానగర్ ద్వితీయ జట్టుకు రూ. 5వేలు నగదుతోపాటు షీల్డ్‌లను తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, బీట్ ఆఫీసర్ కుడుముల బక్కయ్యల చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ సునీల్ మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన కాటాపూర్ యూత్‌ను అభినందించారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు.

మజీద్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో రమేష్, తదితరులు

ఏటూరునాగారం: మండలంలోని జామ మజీద్‌లో బుధవారం సాయంత్రం రంజాన్ ఉపవాస దీక్షలు పురస్కరించుకొని శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేష్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును అందజేశారు. హిందూ ముస్లిం సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో బాడిశ నవీన్, ఆదినారాయణ, మునిగెల మహేష్, కొమరం నితిన్, బోడ ప్రవీణ్, జానపట్ల జయరాజు, మజీద్ చైర్మన్ వలిబాబా, అజ్మత్‌ఖాన్, టీఆర్ఎస్‌నాయకులు సర్దార్, కిరణ్, రామకృష్ణ, చంద్రబాబు, చిన్ని, రాంనర్సయ్య, ఖాజాపాషా పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకున్న తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ.. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ అధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ..మొదట మూడు సంవత్సరాలు ఉన్న ప్రొబేషన్ పీరియడ్‌ను సీఎం కేసీఆర్ నాలుగు సంవత్సరాలకు పొడిగించారని, ఆనాలుగు సంవత్సరాల గడువు ముగిసినందున తమను వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. లేని పక్షంలో రాష్ట్ర సంఘం కార్యాచరణ మేరకు ఏప్రిల్ 28 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం నాయకులు రాంబాబు, రాములు, మనోజ్,నాయకులు, సందీప్, వినోద్, తదితర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

మహాముత్తారం: కనుకునూర్ కు చెందిన చీకట్ల మానస అనారోగ్యంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ నిధులకోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.25వేల చెక్కును బుధవారం కనుకునూర్‌లో మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి అందజేశారు. సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ శ్రీపతి సురేష్, జేపాల్‌నాయక్, లింగయ్య పాల్గొన్నారు.

మహాముత్తారం(మల్హర్): మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా.. బుధవారం తాడిచర్లలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, వైస్ఎంపీపీ బడితెల స్వరూప రాజయ్య, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ నాగరాణి, ప్రకాష్‌రావు, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

బోర్డు మాత్రమే ఉంది..!

- కానరాని ఆటవస్తువులు
- నిరుపయోగంగా క్రీడాప్రాంగణం



బీసీ మర్రిగూడెం పంచాయతీలో బోర్డు పెట్టి వదిలేసిన క్రీడాప్రాంగణం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం పంచాయతీలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డులకే పరిమితమైందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ క్రీడా ప్రాంగణంలో యువతి యువకులు, చిన్నారులు అడుకునేందుకు గాను ఎలాంటి ఆట వస్తువులను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో కనీసం వాలీబాల్, బ్యాట్ మెంటన్ కోర్టులను కూడా ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణంలో అన్నిరకాల సౌకర్యాలను కల్పించాలని గ్రామస్తులు, యువకులు కోరుతున్నారు.

పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి



సమ్మేళనంలో మాట్లాడుతున్న నాగరమేష్

మంగపేట: రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు బాడిష నాగరమేష్ అన్నారు. మండలంలోని కోమటిపల్లి ముక్కిడి పోషమ్మ ఆలయ ప్రాంగణంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు కోగిళ మహేష్ అధ్యక్షతన నాగరమేష్ ఆధ్వర్యంలో మండలంలోని 25 గ్రామ పంచాయతీల యూత్ కమిటీల అధ్యక్ష కార్యదర్శులతో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ యూత్ విభాగం గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకార్యకర్తల కష్ట సుఖాలు, యూత్ విభాగంలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ఆత్మీయ యువ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పార్టీ శ్రేణులందరూ కుటుంబ సభ్యులుగా కష్టపడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించి చైతన్య వంతుల్ని చేయాలని దిశా నిర్దేశం చేశారు. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ నాయకత్వంలో అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేసి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, చైర్మన్ తోట రమేష్, కాడబోయిన నరెందర్, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మండల నాయకులు చిట్టిమళ్ల సమ్మయ్య, హరిబాబు, సుకుమార్, శంకర్, హేమాచలక్షేత్రం రెనోవేషన్ కమిటీ చైర్మన్ ముకుందం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు

- మృతురాలి తల్లిదండ్రుల డిమాండ్



మాట్లాడుతున్న బాధిత తల్లిదండ్రులు, బంధువులు

మంగపేట: మండలంలోని కోమటిపల్లిలో ఈ నెల 17న తమ కూతురు కడారి ఝాన్సీరాణిని అత్తింటి వారు హత్యచేసిన అనంతరం ఉరేసి ఆత్మహత్య చేసుకుందని చిత్రీకరిస్తున్నారని ఝాన్సీ తల్లిదండ్రులు చందనచక్రధర్‌రావు దంపతులు మల్లూరులోని తమ ఇంటి వద్ద బుధవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. కోమటిపల్లిలో ఏప్రిల్ 17న ఝాన్సీరాణి(19) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయంపై ఆమె తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కూతురుది ఆత్మహత్య కాదని, భర్త మోహన్, అతని కుటుంబ సభ్యులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. 2023 ఫిబ్రవరి 12న కోమటిపల్లికి చెందిన కడారి మోహన్‌తో వివాహం జరిపించామని, కట్నం కింద లక్షలాది రూపాయల విలువైన పొలంతో పాటు 10తులాల బంగారం ఇచ్చామన్నారు. పెళ్లి అయిన కొద్ది రోజులకే 10 తులాల బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టుకున్నారని అయినా తాము పట్టించుకోలేదన్నారు. పెళ్లిఅయిన 15 రోజుల నుంచే తమ కుమార్తెను అల్లుడు మోహన్ వారి కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేశారని తెలిపారు. ప్రస్తుతం గర్భిణి అని నీరసంగా ఉన్నా పట్టించుకోలేదని కనీసం సమయానికి భోజనం పెట్టేవారు కాదని ఆరోపించారు. ఈ క్రమంలోనే భర్త మోహన్ వేరొక మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న విషయం తెలుసుకున్న తమకూతురు నిలదీయడంతో కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. 17న సోమవారం 12 గంటల ప్రాంతంలో తమతో ఫోన్లో మాట్లాడిన రెండు గంటలకు తమ కూతురు ఉరేసుకుని చనిపోయిందని గ్రామస్తులు ద్వారా సమాచారం వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కూతురు మృతికి భర్త మోహన్, కుటుంబ సభ్యులే కారకులని ఆరోపించారు. పోలీసులు మృతికి కారకులైన వారందరిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

చెరువు శిఖం భూములు మాయం

మంగపేట: మండలంలోని మల్లూరు అత్తచెరువు, కోడలు చెరువుల్లోని శిఖం భూములను కొందరు దర్జాగా కబ్జా చేసి పంట పొలాలుగా మార్చుకుంటున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా చెరువుల ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. కబ్జా కారణంగా చెరువు శిఖం భూములు మాయం అయ్యాయని, ఈ విషయంపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి చెరువు శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు గత ఏడాది డిసెంబర్ 09న ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు తాటి నారాయణ, విజయ్‌బాబు, తోలెం నర్సయ్య, శ్రీలత తదితరులు ఆరోపించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జా దారులు ఏకంగా డోజర్ ట్రాక్టర్లతో చదును చేసి పంట పొలాలుగా మార్చుకున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికై న సంబంధిత అధికారులు స్పందించి శిఖం భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆయకట్టు రైతులతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరిస్తున్నారు.

పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

- స్పందించిన పూర్వ విద్యార్థి నాగరాజు



విద్యార్థులకు టీ షర్టులు అందజేస్తున్న దాతలు

చిట్యాల: తాను చదువుకున్న పాఠశాలలో సమస్యల పరిష్కారంలో తనవంతుగా సాయం అందించాడు పూర్వ విద్యార్థి నాగరాజు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో మండల కేంద్రానికి చెందిన తౌటం నాగరాజు విద్యాభ్యాసం చేశాడు. ప్రస్తుతం వృత్తి రీత్యా లండన్‌లో వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల చదువుకున్న పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నాడు. చదువుకున్న స్కూల్‌కి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో రూ.70వేలు విలువ చేసే 150 టీషర్ట్స్, వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు, కుర్చీలు, వాటర్ క్యాన్ సెట్, క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి తన తండ్రి తౌటం అంతులు చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా నాగరాజుకు ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, చిట్యాల ఎంపీటీసీ, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి కట్కూరి పద్మ నరేందర్‌లు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తౌటం అంతులును సన్మానించారు. కార్యక్రమంలో రఘుపతి, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274